క్లుప్తంగా

సురక్షిత తాగునీటిని తాగాలి



బొమ్మిడిపాలెంలో అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు

మామిడికుదురు: సురక్షితమైన మంచినీటిని తాగడం ద్వారా అంటు వ్యాధుల నుంచి రక్షణ పొందే అవకాశం ఉంటుందని హెల్త్ అసిస్టెంట్ కేవీ సూర్యనారాయణ సూచించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాశర్లపూడి బొమ్మిడి పాలెంలో జరిగింది. దీనిలో భాగంగా ఇంటింటికీ తిరిగి ఐదేళ్లలోపు పిల్లల వివరాలను సేకరించారు. ఒక్కో ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. డయేరియా వ్యాప్తి చెందినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు, డయేరియా వ్యాపించకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఇందిర, ఏఎస్ఎం భూలక్ష్మి, ఆశలు జి.లక్ష్మి, కె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు

సఖినేటిపల్లి: ది ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల శాఖ నూతన కార్యవర్గం సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం సఖినేటిపల్లిలో జరిగింది. అంతకు ముందు అసోసియేషన్ సభ్యుల ఎంపిక జరిగింది. ప్రెసిడెంట్‌గా నల్లి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్‌వీ రత్నం, సెక్రటరీగా బుంగా కుమార్, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ కిషోర్, కోశాధికారిగా నల్లి శేఖర్ నియమితులయ్యారు. గౌరవ అధ్యక్షులుగా నల్లి స్టాలిన్, దాసరి నరసింహారావు, గౌరవ సలహాదారులుగా పాలపర్తి శేఖర్, మేడిది నవీన్ నియమితులైయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను కోనసీమ జిల్లా ప్రెసెడెంట్ జి.సురేష్, ఏపీ వైస్ ప్రెసెడెంట్ సీవీ రావు, రాజోలు తాలూకా ప్రెసిడెంట్ సాయిబాబు అభినందనలు తెలిపారు.

అంతర పంటలకు సబ్సిడీపై హర్షం

అంబాజీపేట: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అంతర పంటలకు సబ్సిడీ ప్రకటించడంపై అంబాజీపేట రైతు సంఘ సమావేశం హర్షం వ్యక్తం చేసింది. స్థానిక రైతు కొర్లపాటి కోటబాబు వ్యవసాయ క్షేత్రంలో రైతు సంఘ సమావేశం శుక్రవారం జరిగింది. పలువురు రైతులు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కొబ్బరి తోటల్లో అంతర పంటలు సాగు చేస్తున్న రైతులకు సబ్సిడీ ఇవ్వడం వల్ల మేలు చేకూరుతుందన్నారు. సమావేశంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మామిడికుదురు: ఇంటి వద్ద అరుగు మెట్లపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన బి.దొడ్డవరం గ్రామానికి చెందిన యేడిద కేశవరావు (63) కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందాడని నగరం ఎస్సై పి.సురేష్ శుక్రవారం తెలిపారు. దీనిపై మృతుని భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. కేశవరావు ఆరేళ్ల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడని చెప్పారు. గురువారం భార్య సాయమ్మ సహాయంతో బాత్రూమ్‌కు వెళ్తుండగా ఇంటి అరుగు మెట్లపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడన్నారు. అతన్ని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు.

వైభవంగా చండీహోమం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసియున్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో మంగళవారం అత్యంత వైభవంగా చండీహోమం జరిగింది. జ్యేష్ఠ మాస బహుళ అమావాస్యను పురస్కరించుకుని స్థానిక ఆలయ ఆవరణలో శుక్రవారం ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ, జేఏ డి.భాస్కర్‌శ్రీనివాసు ఆధ్వర్యంలో ఈ చండీహోమం జరిగింది. అనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామానికి చెందిన భక్తులు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ ఆవరణలో ప్రతి నెలా అమావాస్య రోజున చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ కృష్ణ తెలిపారు. ఈ హోమంలో పాల్గొనే భక్తులు స్థానిక దేవదాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నేదునూరులో త్రికాల రుద్రాభిషేకం

అయినవిల్లి: మండలంలోని నేదునూరులో వేంచేసిన కనకదుర్గ చెన్నమల్లేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా త్రికాల రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు వెలువలపల్లి బుచ్చిరామయ్య, పండితులు సుధీర్ నేతృత్వంలో ఈ అభిషేకాలు జరిపారు. స్వామికి ఇష్టమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో ఈ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామిని ఈ సందర్భంగా వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

రహదారులు ఛిద్రం

- అధికారుల ఉదాసీనత
- నిబంధనలు బేఖాతర్

ఆలమూరు: దమ్ము ట్రాక్టర్లు నిబంధనలను సక్రమంగా పాటించకపోవడంతో రూ.కోట్లతో నిర్మిస్తున్న గ్రామీణ రహదారులను ఛిద్రం చేస్తున్నాయి. దీనివల్ల పుంత రోడ్లతో పాటు తారు రోడ్లు, సిమెంట్ రోడ్లు కూడా అనతికాలంలోనే తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఏళ్ల తరబడి మన్నికగా ఉండవలసిన రోడ్లు కొద్ది నెలలకే గోతులు పడి శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు రోజు రోజుకు దిగజారుతున్న ఈ తరుణంలో బద్దె లేకుండా దమ్ము చక్రాలతో నడవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది. ఫలితంగా కోట్లాది రూపాయల నిధులు వృథాగా పోతున్నాయి. దమ్ము ట్రాక్టర్ల ప్రవేశానికి కనీస నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో దమ్ము చక్రాలు బిగించిన ట్రాక్టర్లు రోడ్లపై స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ఇటీవల నిర్మించిన రహదారులు బీటలు వారి పోయి అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. దీనివల్ల వర్షపు నీరు గోతుల్లో ఉండి తక్కువ సమయంలోనే మరమ్మతులకు చేరుకుంటున్నాయి. క్లస్టర్ పరిధిలోని రాజోలు, పి.గన్నవరం



పెనికేరులో దమ్ము ట్రాక్టర్ల వల్ల తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డు

, కొత్తపేట నియోజకవర్గాల్లో సాగు చేస్తున్న సుమారు 28 వేల ఎకరాలకు సంబంధించి దాదాపు రెండు వేల ట్రాక్టర్ల వరకూ దుక్కు దున్నే అవకాశం ఉంది. అయితే అందులో దాదాపు సుమారు 40 శాతం మంది ట్రాక్టర్ యజమానులు బద్దెలు అమర్చడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు చూసి చూడనట్లు వదిలి వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వేళ అధి



సూర్యారావుపేటలో దమ్ము చక్రాలతో ట్రాక్టర్

కారులు దమ్ము చక్రాల ట్రాక్టర్‌ను సీజ్ చేసినా పాలకుల ఒత్తిడితో సత్వరమే బయటకు వస్తున్నాయి. దీనివల్ల కూడా అధికారులు పట్టించుకోకపోవడానికి కారణంగా తెలుస్తోంది. అయితే ఇటీవల కొన్ని గ్రామాల్లో చిన్న ట్రాక్టర్లు ఎక్కువగా దమ్ము చేయడం కొంత మేర ఊరటనిస్తుంది.

యజమానులు నిబంధనలు పాటించాల్సిందే

ప్రభుత్వం విధించిన నిబంధనలను ట్రాక్టర్ యజమానులు సక్రమంగా పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడుతుందని స్థానికుల నుంచి ఆవేదన వ్యక్తమవుతుంది. వాహనదారుడు పొలాల్లో దుక్కు దున్ని వెళుతున్నప్పుడు కచ్చితంగా చక్రాలకు ఇనుపబద్దెను అమర్చుకోవాలి. లేకుంటే పొలంలోకి టైర్లతోనే వెళ్లి అక్కడే దమ్ము చక్రాలను బిగించుకోవాలి. అనంతరం మరో పొలంలో వెళ్లాలనుకుంటే మళ్లీ టైర్లు మార్చుకుని ప్రవేశించాలి. దమ్ము పూర్తయిన అనంతర మళ్లీ టైర్లు బిగించుకుని గమ్య స్థానానికి చేరుకోవాలి. కనీస భద్రతా చర్యలు పాటించని ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేస్తే మిగిలిన వారైన నిబంధనలను పాటించే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ మండలంలో రెండేళ్ల నుంచి ఒక కేసు కూడా నమోదు కాకపోవడం అధికారుల అసమర్థతను చూపిస్తుంది.

ఛిద్రమైన రోడ్లు

మండలంలో పలు రోడ్లు దమ్ము ట్రాక్టర్ల దెబ్బకు తీవ్రంగా ఛిద్రమవుతున్నాయి. ఈఏడాది నిర్మించిన కలవచర్ల–వెదురుమూడి రోడ్డు, ఆలమూరు–పెనికేరు రోడ్డుతో పాటు అనేక సీసీ రోడ్లు దమ్ము చక్రాల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎన్ఆర్‌జీఈఎస్‌లో నిర్మించిన గ్రావెల్‌రోడ్లు దమ్ము చక్రాల దెబ్బకు గోతులు ఏర్పడి చిత్తడిగా మారుతుంది. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుని కోట్లాది రూపాయల విలువైన రోడ్లను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

దమ్ము ట్రాక్టర్ల యజమానులకు ఆదేశాలిచ్చాం

పొలాల్లో దమ్ము చేసే ట్రాక్టర్ యజమానులు తప్పనిసరిగా ఇనుక చక్రాలకు బద్దెలు అమర్చుకోవాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. దానికనుగుణంగా అనేక మంది ట్రాక్టర్ల యజమానులు బద్దెలు అమర్చుతున్నారు. పొరపాటున నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– డీవీఎస్ అనిల్‌కుమార్, తహసీల్దార్, ఆలమూరు

శ్రీచక్రం ఆలయంలో భక్తుల పూజలు



కొత్తపేట ఏనుగులమమల్‌లో శ్రీచక్రానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: స్థానిక ఏనుగులమమహల్‌లో శ్రీచక్ర మహామేరు యంత్రం (రాజరాజేశ్వరీదేవి) ఆలయానికి శుక్రవారం అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దేశంలోనే అతిపెద్ద శ్రీచక్రం ఈ ఏనుగులమహల్ గ్రామంలోనే ఉంది. ఈ యంత్రాన్ని రాజరాజేశ్వరీదేవిగా భక్తులు కొలుస్తారు. రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు ప్రత్యేకంగా ఆలయానికి వచ్చి దర్శించుకుంటారు. జ్యేష్ఠ మాసం అమావాస్య, శుక్రవారం విశిష్టమైనది. అమ్మవారికి ప్రీతికరమైనది. దీంతో మందపల్లి, ఏనుగులమహాల్, కొత్తపేట గ్రామాల నుంచే కాక సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ముఖ్యంగా మహిళలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అయిలూరి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున శ్రీచక్రానికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కుంకుమ పూజలు జరిపించారు.

క్రమశిక్షణే ఉన్నత స్థాయికి దోహదం

అంబాజీపేట: విద్యార్థులు పాఠశాలలో నేర్చుకున్న క్రమశిక్షణ వారు జీవితంలో ఉన్నత దశకు చేరుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌ల పర్యవేక్షణలో హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, అంబాజీపేట, తొండవరం, ఇసుకపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు విద్యార్థి కిట్లను శుక్రవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో లేని మౌలిక వసతులను ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించామన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న కొర్లపాటివారిపాలెంకు చెందిన ట్విన్స్ యర్రంశెట్టి చిత్ర హర్షిణి, చిత్ర వర్షిణిలు వారి దాచుకున్న రూ.9,999లు నగదును అమరావతి నిర్మాణానికి సాయం చేస్తున్నామని ఎమ్మెల్యేకు అందించారు. త్రైక్వాండో, బాస్కెట్ బాల్ పోటీల్లో విజయాలు సాధించిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. కేవీ పాలెం కమ్యూనిటీ భవనంలో దివ్యాంగుల పింఛను పెంచిన కారణంగా దివ్యాంగుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్‌లు నాగాబత్తుల శాంత కుమారి, దొంగ నాగేశ్వరరావు, ఎంపీడీఓ జి.సరోవర్, గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు

అంబాజీపేట: ప్రొటోకాల్ పాటించకుండా ఇసుకపూడి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తనను అవమాన పరిచారని స్థానిక ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్ ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థి కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగిందని, అయితే ఆయా గ్రామాల ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు హెచ్‌ఎంలు సమాచారం ఇచ్చారని, ఇసుకపూడి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మాత్రం ఎటువంటి సమాచారం ఇవ్వలేదని ప్రశాంత్ వివరించారు. ప్రజాప్రతినిధులు పట్ల ప్రొటోకాల్ పాటించకుండా అవమానపరచడం దారుణమన్నారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాది పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడమే కాకుండా అన్ని రకాల వసతులు ఉన్నాయని ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రహించాలని ఎంఈఓ–1,2లు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడి బయట విద్యార్థులను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం చేర్పించారు. ఎంఈఓలు మాట్లాడుతూ కప్పిరి ప్రేమజ్యోతి 8వ తరగతిలోను, నార్లగంటి రత్నకుమారి తొమ్మిదో తరగతిలో చేర్పించామన్నారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో నేను బడికి పోతా సర్వే చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కడలి సాయిరామ్, సీఆర్పీలు పి.గోవిందరాజు, నాగరాజు, పీఈటీ అందె సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సాగునీటి సమస్యల పరిష్కారం

మలికిపురం: ఇరిగేషన్, డ్రైన్స్, రెవిన్యూ, ఉద్యాన శాఖల సమన్వయంతోనే సాగునీటి సమస్యల పరిష్కారం అవుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం మలికిపురంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో డ్రైన్స్ పూడుకుపోయాయని, కాలువలు సక్రమంగా లేక ఆయకట్టుకు నీరు అందడం లేదని పేర్కొన్నారు. ఆక్రమణలతో పాటు రెవెన్యూ పరంగా భూ సమస్యలు ఉండడం వల్ల సాగు సక్రమంగా ఉండడం లేదని గుర్తించినట్లు ఆయన వివరించారు. దీనికి ఒక ప్రణాళిక రూపొందించి ముందుకు సాగాలని, ఈ ప్రణాళికను లీడ్ చేసే అధికారి ఎవరని ఆయన ప్రశ్నించారు. దీనిపై డ్రైన్స్, ఇరిగేషన్ డీఈలు మాట్లాడుతూ వీటి అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచామని పనులు జరగాలంటే మార్చి నెల రావాలని పేర్కొన్నారు. నీటి ప్రవాహం తగ్గితే డిసెంబర్‌లోనే డ్రైన్స్ అభివృద్ధి పనులు చేపట్టవచ్చని పేర్కొన్నారు. డ్రైన్స్ డీఈ నాగార్జునరావు మాట్లాడుతూ శంకరగుప్తం డ్రైన్‌కు సమాంతరంగా సముద్రం వైపు గోగన్నమఠం అనే పేరుతో డ్రైన్ ఉందని ప్రస్తుతం ఆ డ్రైన్ ఆక్రమణలో ఉందని, దానికి మరమ్మతులు చేస్తే శంకరగుప్తం డ్రైన్‌పై భారం తగ్గుతుందని అన్నారు. నిధుల అందుబాటును బట్టి అన్ని డ్రైన్‌ల మరమ్మతులకు ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే దేవ సూచించారు.



సమీక్షలో మాట్లాడుతున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం

మలికిపురం: మలికిపురం రోటరీ క్లబ్ 3020 నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. క్లబ్ అధ్యక్షురాలిగా గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎమ్మార్వో బత్తుల ఝాన్సీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రోటరీ డిస్టిక్ట్ 3020 అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్ తెలియజేశారు 30 సంవత్సరాలుగా రోటరీ సేవలో ఉన్న మల్కిపురం రోటరీ క్లబ్ 2024–25 సంవత్సరానికి గాను నూతన అధ్యక్షురాలిగా రిటైర్డ్ ఎమ్మార్వో బత్తుల ఝాన్సీ, కార్యదర్శిగా వెటర్నరీ డాక్టర్ బందెల సంపత్‌కుమార్ ఎన్నికైనట్టు తమ పదవి బాధ్యతలను జూలై 1వ తేదీ నుంచి కొనసాగిస్తారని తెలియజేశారు. 2023–24లో అనేకమైన సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందిన ప్రస్తుత క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి మురళీకృష్ణ, కార్యదర్శి బి.సంపత్ కుమార్, కోశాధికారి తోలేటి సతీష్‌లను క్లబ్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో గెడ్డం ఫిలిప్ రాజు, సెక్రటరీ మట్ట రవి, రాపాక విజయరావు, గుబ్బల బాబ్జి, గెడ్డం తులసి భాస్కరరావు పాల్గొన్నారు.



మలికిపురంలో రోటర్లీ క్లబ్ నూతన అధ్యక్షురాలు బత్తుల ఝాన్సీతో కార్యవర్గం

సంపూర్ణ పారిశుధ్యంతో అంటువ్యాధుల నివారణ

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా అంటువ్యాధుల నివారణ సాధించవచ్చని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. అంటువ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలన వివరించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్య సేవలను పర్యవేక్షించారు.



చొప్పెల్లలో డ్రైడే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రామరాజులంకలో అమ్మకు వందనం



రామరాజులంక అమ్మకు వందనంలో పాల్గొన్న ఎంపీపీ సత్యవాణి

మలికిపురం: మండలంలోని రామరాజులంక శివారు పెదతిప్ప అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే, అమ్మకు వందనం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఐదు సంవత్సరాలు నిండి ఆరో సంవత్సరంలో ప్రవేశిస్తున్న పిల్లలు ఎలిమెంటరీ స్కూల్లో జాయిన్ అయ్యే సందర్భంగా ఈ గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడీ స్కూల్ ద్వారా పిల్లలకు పౌష్టికాహారం, క్రమశిక్షణతో కూడిన విద్య అంగన్వాడీల ద్వారా ఇవ్వబడుతుందని తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర శ్రీనివాస్, రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి అంగన్వాడీ టీచర్ రాధిక, రామరాజులంక పంచాయతీ పరిధిలో ఉన్న అంగన్వాడీ టీచర్లు, విద్యార్థిని తల్లిదండ్రులు, స్కూల్ హెచ్ఎం ప్రభావతి, ఉపాధ్యాయురాలు ప్రతిభ గ్రామస్తులు పాల్గొన్నారు.

వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అయినవిల్లి: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు అధికంగా కురుస్తున్న కారణంగా ఏ క్షణానైనా గోదావరి వరదలు వచ్చే ప్రమాదం పొంచి ఉందన్నారు. రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన అయినవిల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమద్వర నేతృత్వంలో వీఆర్వోలతో సమీక్షించారు. ప్రస్తుతం వరదల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే తొలకరి సాగుకు రైతుల సన్నద్ధం అవుతున్న సందర్భంలో కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. అలాగే మండలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక నిల్వలు వంటి వాటిపై ఆరా తీశారు. అలాగే 400 కేవీ విద్యుత్ లైన్‌కు కోసం సేకరించిన భూముల కోసం ఆరా తీశారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: వరదల సీజన్ రానున్న నేపథ్యంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మండలంలోని వీఆర్వోలు, వీఆర్ఏలు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వరదల వల్ల ఏఏ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది, అక్కడ చేపట్టాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. అలాగే రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై వీఆర్వోలు, వీఆర్ఓలకు సూచనలిచ్చారు. సమావేశంలో తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, డీటీ డి.శ్రీనివాస్, ఆర్ఐ పి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.




అయినవిల్లిలో సమావేశంలో ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ

ఆషాఢం.. శుభకార్యాలకు విరామం

- కొత్త దంపతులు ఎవరి పుట్టింట్లో వారు
- వర్షాకాలం ప్రారంభం
- వ్యవసాయ పనులకు శ్రీకారం

కొత్తపేట: తెలుగు మాసాల్లో ఒక్కో మాసానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. తెలుగు క్యాలెండర్ ప్రకారం చైత్రమాసంతో కొత్త ఏడాది ప్రారంభమై ఫాల్గుణమాసంతో ముగుస్తుంది. ఈ క్రమంలోనే నాలుగో నెలగా ఆషాఢమాసం వస్తుంది. హిందూ పురాణం ప్రకారం ఈ మాసానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. పాటించవలసిన నియమాలున్నాయి. ఆషాఢం ఈ నెల 6 నుంచి ప్రారంభమై వచ్చే నెల 4 తో ముగుస్తుంది. ఆ తరువాత శ్రావణమాసం ప్రారంభమౌతుంది. ఆషాఢమాసంలోనే పూర్వాషాఢ, ఉత్తరాషాఢ నక్షత్రాలొస్తాయని, ఆషాఢ పౌర్ణమి రోజున చంద్రుడు ఈ రెండింటి మధ్య ఉంటాడని అందుకే ఈ మాసాన్ని ఆషాఢ మాసంగా పేర్కొన్నారని పండితులు చెబుతారు. ముఖ్యంగా ఆషాఢమాసం అనగానే గుర్తుకువచ్చేది కొత్తగా పెళ్లైన దంపతులు కలవకూడదనే ఆచారం. ఇది పూర్వం నుంచీ వస్తుంది. దీని వెనుక శాస్త్రీయ కారణాలు ఉన్నాయని పెద్దలు, పండితులు చెబుతారు. ఈ మాసం నుంచే వర్షాకాలం ప్రారంభమౌతుంది. రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టి పనులు ప్రారంభిస్తారు. ఈ నెలలోనే గురు పూర్ణిమ, దేవశయన ఏకాదశి, బోనాల ఉత్సవాలు వంటి ముఖ్యమైన ఉపవాస, పండుగలు జరుపుకొంటారు. చాతుర్మాసం కూడా ఈ నెలలోనే ప్రారంభమౌతుంది. పురాణాల ప్రకారం మహావిష్ణువు విశ్రాంతి తీసుకుంటాడని, అందుకే ఈ కాలంలో శుభకార్యాలు చేయడాన్ని నిషేధించారని చెబుతారు. అయితే విష్ణుమూర్తిని పూజించడం, మంత్రాలను జపించడం శుభప్రదంగా పరిగణిస్తారు. దుర్గామాత ఆరాధన శక్తినిస్తుందని చెబుతారు. ఈ మాసంలో దుర్గాదేవిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దానధర్మాలకు ప్రాధాన్యం గల మాసమని, దానధర్మాలు చేయడం వలన ఎంతో పుణ్యం లభిస్తుందంటారు. ఆషాఢ అమావాస్య రోజున పూర్వీకులను స్మరించుకుంటూ శ్రాద్ధ కర్మలు, తర్పణం నిర్వహించడం ద్వారా వారి అనుగ్రహం లభిస్తుందంటారు. ఈ కాలంలో గ్రామీణవాసులు గోరింటాకు పెట్టుకుంటారు. దీనితో సైన్స్ ముడిపడి ఉంది. వర్షాలు కురవడం కారణంగా క్రిమికీటకాలు పెరిగి అంటువ్యాధులు ప్రబలుతాయి. చర్మవ్యాధుల నివారణకు చేతులు, కాళ్లకు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుంది.



ఆషాఢమాసం ప్రత్యేకత గోరింటాకు

117 జీవోతో విద్యా విధానం అతలాకుతలం

అయినవిల్లి: గత ప్రభుత్వం తీసుకువచ్చిన 117 జీవోను రద్దు చేసి, అందులోని లోపాలను సరిచేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఫ్యాప్టో చైర్మన్ ఐ.సాయి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన అయినవిల్లిలోని మండల పరిషత్ కార్యాలయంకు విచ్చేసిన సందర్భంగా ఎస్టీయూ శాఖ సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాను ఎస్టీయూ సంఘ సభ్యత్వం నమోదుకు, ఎస్టీయూ నాయకులు పడుతున్న సమస్యల పరిష్కారం కోసం వచ్చానన్నారు. ఇంకా అతలాకుతలం అవుతున్న విద్యా విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం సరిచేయాలని డిమాండ్ చేశారు. 117 జీఓను రద్దు చేసి, అందులోని లోపాలను సరిచేయాలన్నారు. కొత్త విద్యా సంవత్సరంలోనైనా ప్రభుత్వ విద్యాక్షేత్రాలను కాపాడాలని ఆయన కోరారు. ఇప్పటికైన కొత్త పరీక్ష విధానంలో కాకుండా పాత పరీక్ష విధానంలోనే చేసి విద్యార్థులకు ఆదర్శవంతమైన పరీక్ష విధానం కావాలని ఎస్టీయూ భావిస్తుందన్నారు.



చొప్పెల్లలో డ్రైడే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది